కొనసాగుతున్న పనులు

- దగ్గర పడుతున్న సెలవులు
- మన ఊరు మన బడి పనుల్లో కొరవడిన నాణ్యత

వేములవాడరూరల్: గ్రామీణ ప్రాంతాల్లో కూడా విద్యనభ్యసిస్తున్న పిల్లలకు విద్యతో పాటు సౌకర్యాలు కూడా మెరుగ్గా ఉండాలని ప్రభుత్వం మన ఊరు, మనబడి కార్యక్రమం కింద కొన్ని పాఠశాలలను ఎంపిక చేసింది. మొదటివిడతగా ఎంపిక చేసిన ఈ పాఠశాలలను గత వేసవికాలంకు ముందు పనులకు శ్రీకారం చుట్టారు. రెండు నెలల వేసవికాలంలో పిల్లలకు సెలవులు ఉన్నందున ఈ పనులను ఎంపిక చేసిన పాఠశాలల్లో గుర్తించిన పనులను సకాలంలో పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. కానీ చాలా గ్రామాల్లో ఆ దిశగా పనులు జరగడం లేదు. ప్రస్తుతం మరికొద్ది రోజుల్లో వేసవి సెలవులు రానున్నందున ఇప్పటి వరకు మండలంలో గుర్తించిన పాఠశాలల్లో పనులు పూర్తి కాలేదు.


హన్మాజిపేటలో కొనసాగుతున్న ప్రహరీ నిర్మాణ పనులు

పాఠశాలల పనుల పురోగతి

వేములవాడ రూరల్ మండలంలో 17 గ్రామాలుండగా ఎంపీపీఎస్ మర్రిపల్లి, వట్టెంల, చెక్కపల్లి, ఎంపీపీఎస్ హన్మాజిపేట, జడ్పీహెచ్ఎస్ హన్మాజిపేట, ఎంపీపీఎస్ నూకలమర్రి, జెడ్పీహెచ్ఎస్ నూకలమర్రి, ఎంపీపీఎస్ బాలరాజుపల్లి, ఫాజుల్‌నగర్ గ్రామాల్లో ఉన్న తొమ్మిది పాఠశాలలను గుర్తించారు. వీటిలో ఇప్పటి వరకు ఎంపీపీఎస్ మర్రిపల్లి, వట్టెంల, చెక్కపల్లి, ఎంపీపీఎస్ హన్మాజీపేట, జెడ్పీహెచ్ఎస్ హన్మాజిపేట ఈ పాఠశాలల్లో మాత్రమే పనులు పూర్తయినట్లు అధికారులు తెలిపారు. ఇక జెడ్పీహెచ్ఎస్ నూకలమర్రి, ఎంపీపీఎస్ నూకలమర్రి, ఎంపీపీఎస్ బాలరాజుపల్లి గ్రామాల్లో మాత్రం పనులు ఇంకా కొనసాగుతున్నాయి. ఎంపీపీఎస్ ఫాజుల్‌నగర్ గ్రామంలో మాత్రం ఇప్పటి వరకు పనుల పురోగతి లేదు.

కొరవడిన నాణ్యత

ఈ పనుల్లో నాణ్యత కొరవడినట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం మొదటి విడతగా గుర్తించిన ఈ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలను విద్యార్థులకు ఉండేలా చర్యలు తీసుకుంది. కానీ ఈ పాఠశాలలో జరుగుతున్న పనుల్లో నాణ్యత కొరవడి పైపైనే పనులు చేసి రంగులు వేస్తున్నట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. కొన్ని పాఠశాలలకు పాత వాటికే పూతలు పెట్టి చేతులు దులుపుకున్నట్లు తెలిసింది. వీటిని పరిశీలించేందుకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన అధికారులు అటువైపు వెళ్లకపోవడంతో కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా పనులు చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. పూర్తయిన గ్రామాల్లో కొంతమంది ప్రజాప్రతినిధులు సొంత డబ్బులు వెచ్చించి సకాలంలో పనులు పూర్తి కావాలని పనులు చేసినప్పటికీ ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు.

మొదటి విడతలోనే పూర్తి చేశాం



మండలంలో అన్ని గ్రామాల కంటే మా గ్రామంలోనే మొదటగా పూర్తి చేశాం. ప్రభుత్వం మంచి ఉద్దేశ్యంతో పాఠశాలను గుర్తించి అనుమతులిచ్చింది. దానిని అందరూ సద్వినియోగం చేసుకోవలని విద్యార్థులకు సౌకర్యాలు కల్పించాలి. నా బాధ్యతగా మొట్ట మొదటగా నేనే పూర్తి చేశాను. ఇంకా నిధులు రాలేదు. – కట్కం మల్లేశం, సర్పంచ్, మర్రిపల్లి

మా పాఠశాలను ఎంపిక చేయాలి



మండలంలో ఎదురుగట్ల గ్రామంలో ఉన్న ప్రాథమిక పాఠశాలను గుర్తించి ప్రత్యేకంగా నిధులు కేటాయించాలి. పాఠశాలలో మౌలిక సౌకర్యాలు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. వెంటనే జిల్లా అధికారులు పాఠశాలను ఎంపిక చేసి పనులు పూర్తి చేయాలి. –కట్కం మల్లేశం, సర్పంచ్, మర్రిపల్లి

నెలాఖరు వరకు పూర్తి చేస్తాం

ఈ కార్యక్రమానికి 9 పాఠశాలలు ఎంపిక య్యాయి. వాటిలో కొన్ని పాఠశాలల్లో పనులు పూర్తయ్యాయి. మిగతా పనులు కూడా ఏప్రిల్ చివరి వరకు పూర్తి చేస్తాం. – నవీన్, ఇరిగేషన్ ఏఈ, వేములవాడ

క్లుప్తంగా

దళిత్ శక్తి ప్రోగ్రాం సంతకాల సేకరణ


సంతకాలు సేకరిస్తున్న నాయకులు

బోయినపల్లి: రాష్ట్రంలో బీసీ, ఎస్సీ, ఎస్టీల రాజ్యస్థాపనకై దళిత్ శక్తి ప్రోగ్రాం వ్యవస్థాపకుడు డాక్టర్ విశారదన్ మహారాజ్ 10 వేల కిలోమీటర్ల స్వరాజ్య పాదయాత్రకు సంఘీభావంగా బుధవారం బోయినపల్లిలో దళిత్ శక్తి ప్రోగ్రాం(డీఎస్పీ) ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ చేపట్టారు. గతేడాది మార్చి 15న ప్రారంభమైన విశారదన్ మహారాజ్ పాదయాత్ర అన్ని జిల్లాలు తిరుగుతూ ఇప్పటికి 9,300 కిలోమీటర్లు విజయవంతంగా పూర్తి చేసిందని జిల్లా ఉపాధ్యక్షుడు ఎడపెల్లి బాబు తెలిపారు. కార్యక్రమంలో డీఎస్పీ ప్రోగ్రాం మండల అధ్యక్షుడు కొమ్ము విక్రమ్, ప్రతినిధులు కుర్మ సురేశ్, కుడుకల మధు, కుర్మ సంజీవ్, కుర్మ సాయి, ఎడపెల్లి రాజు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ ప్రారంభం


టోర్నీ ప్రారంభిస్తున్న సంఘాల నాయకులు

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్ల మున్సిపల్ పరిధి బోనాలలో ఎంఈవో మంకు రాజయ్య స్మారకార్థం, ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో టీచర్స్ ప్రీమియం లీగ్ క్రికెట్ టోర్నీ బుధవారం ప్రారంభమైంది. జిల్లాలోని 13 మండలాల ఉపాధ్యాయులు ఈ టోర్నీలో పాల్గొంటున్నారన్నారు. శర్మన్ నాయక్, మైలారం తిరుపతి, జక్కని నవీన్, జయకృష్ణ, రవీందర్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

గ్రంథాలయానికి సినారె పుస్తకాలు


పుస్తకాలను అందిస్తున్న సినారె కూతురు గంగ

వేములవాడఅర్బన్: వేములవాడ పట్టణంలో రిటైర్డ్ ఉపాధ్యాయులు వీరబోని ఆంజనేయులు ఇంట్లో ఏర్పాటు చేసిన పౌర గ్రంథాలయానికి డాక్టర్ సి.నారాయణరెడ్డి కూతురు గంగ తండ్రి రచించిన పుస్తకాలను అందజేశారు. బుధవారం గ్రంథాలయాన్ని సందర్శించి మాట్లాడారు. జ్ఞానాన్ని పెంపొందించేది అక్షరమేనన్నారు. అలాంటి పుస్తకాలను తన ఇంటిపై ఏర్పాటు చేసి పలువురికి అందించడం సంతోషమన్నారు. గ్రంథాలయానికి కావలసిన సహాయ సహకారం తాను ఎప్పుడు అందిస్తానని తెలిపారు. వీరగోని ఆంజనేయులు, సరస్వతి, అనూష, చైతన్య పాల్గొన్నారు.

నియామకం

నూతన కార్యవర్గం

ఇల్లంతకుంట: ఐఎఫ్‌టీయూ జిల్లా నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నట్లు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు విశ్వనాథ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా అధ్యక్షుడుగా ఈర్ల రాజలింగం, ఉపాధ్యక్షుడిగా పిల్లి లచ్చయ్య, కోశాధికారులుగా దుంపెటి కరుణాకర్, దమ్మని మొండయ్య ఎన్నికయ్యారు.

మాజీ సర్పంచుల సంక్షేమ సంఘం

చందుర్తి: తెలంగాణ మాజీ సర్పంచ్ సంక్షేమ సంఘం చందుర్తి మండల కన్వీనర్‌గా నర్సింగపూర్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ ఎర్రం శ్రీమన్నారాయణను బుధవారం నియమించినట్లు రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు బొడ్డు దేవయ్య ఓ ప్రకటనలో తెలిపారు. చందుర్తి మండల కన్వీనర్‌గా నియమించిన ఎర్రం శ్రీమన్నారాయణను మాజీ సర్పంచ్‌ల సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏరెడ్డి మల్లారెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి సంపునూరి మల్లేశం గౌడ్, వేములవాడ నియోజక వర్గ కన్వీనర్ పిట్టల వెంకటేశం, ఎలుగుమెట్ల అమరేందర్‌రెడ్డిలు శాలువాలతో ఘనంగా సన్మానించారు.

ఆలయ కమిటీ

ఎల్లారెడ్డిపేట: మండలంలోని అల్మాస్‌పూర్‌లోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ కమిటీ నూతన కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా సానవేణి రాజయ్య, ఉపాధ్యక్షుడిగా నాగెల్లి వెంకట్‌రెడ్డి, కోశాధికారిగా రొండ్ల రాంరెడ్డి, సభ్యులుగా తిరుపతిరెడ్డి, కమలాకర్‌రెడ్డి, మహేశ్, సురేందర్ రెడ్డి, రవీందర్‌రెడ్డి, మల్లయ్య, సురేశ్, శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మారెడ్డి, శరత్‌రెడ్డిని ఎన్నుకున్నారు.

జగ్జీవన్ రామ్‌కు నివాళి


సిరిసిల్లటౌన్: నివాళి అర్పిస్తున్న మున్సిపల్ కౌన్సిల్


ముస్తాబాద్‌లో


సిరిసిల్లఅర్బన్: బెటాలియన్ సిబ్బంది నివాళి


చందుర్తిలో..


రుద్రంగిలో..


వేములవాడరూరల్:: నివాళి అర్పిస్తున్న ఎంపీపీ

మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను జిల్లాలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. బడుగు బలహీనవర్గాల కోసం ఆయన చేసిన సేవలను కొనియాడారు. వివిధ కార్యక్రమాల్లో సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, 17వ పోలీస్ బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ పార్థసారథి, మాలమహానాడు జాతీయ నాయకుడు రాగుల రాములు, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు పసుల బాలరాజు అంబేద్కర్ సంఘాల అధ్యక్షులు, ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ జిల్లా అధ్యక్షుడు కంసాల మల్లేశం, కోకన్వీనర్ తంగళ్లపల్లి రాజు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పెంట రాజు, ఏజీపీ గుడిసె సదానందం, ఎంపీపీలు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, ప్రజాప్రతినిధులు, న్యాయవాదులు, నాయకులు పాల్గొన్నారు. – సాక్షి నెట్‌వర్క్

బీజేపీ నాయకుల అరెస్టు


అరెస్టు అయిన బీజేపీ నాయకులు

వేములవాడరూరల్: బండి సంజయ్ అరెస్టుకు నిరసనగా తలపెట్టిన నిరసన కార్యక్రమానికి వెళ్తున్న వేములవాడ రూరల్ మండల బీజేపీ నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. అరెస్టు అయిన వారిలో మండల అధ్యక్షుడు జక్కుల తిరుపతి, ప్రధాన కార్యదర్శి చెట్టిపల్లి రవికిషోర్, నాయకులు ఉన్నారు.

సీఎం దిష్టిబొమ్మ దహనం చేసినందుకు..

వీర్నపల్లి: సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేసినందుకు బీజేపీ మండల అధ్యక్షుడు గునుకుల దేవేందర్‌రెడ్డి, నాయకులు పిట్ల నాగరాజు, తొటు అజయ్‌పై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై నవత తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రానికి పందికొక్కుల బెడద

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్ల మున్సిపల్ పరిధి చిన్నా బోనాలలోని అంగన్‌వాడీ కేంద్రం అంగన్‌వాడీ కేంద్రం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. పంది కొక్కులు స్వైరవిహారం చేస్తున్నాయి. బండ రాళ్ల కింద మట్టిని తోడుతూ, వంట సామగ్రిని సైతం పాడు చేస్తున్నాయి. సెంటర్‌కు వచ్చే చిన్నారులు పందికొక్కులు, ఎలుకలను చూసి భయాందోళనకు గురవుతున్నారు. ఈ కేంద్రంలో కనీస వసతులు కల్పించాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో పిల్లలను సెంటర్‌కు పంపేందుకు తల్లిదండ్రులు వెనుకాడుతున్నారు. రెండేళ్లుగా పక్క గ్రామం అంగన్‌వాడీ టీచర్ ఇన్‌చార్జిగా ఉన్నారు. ఈ కేంద్రం సమస్యలు పరిష్కరించాలని చాలాసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లిన ఫలితం లేకుండా పోయిందని, అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని మున్సిపల్ కౌన్సిలర్ బోల్గం నాగరాజుగౌడ్ కోరారు.


కేంద్రంలో పందికొక్కులు తోడేసిన మట్టి

ఎంపీ బండి సంజయ్ దిష్టిబొమ్మ దహనం



బోయినపల్లి: స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో బుధవారం సాయంత్రం బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కత్తెరపాక కొండయ్య ఆధ్వర్యంలో ఎంపీ బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఎంపీపీ వేణుగోపాల్, సెస్ డైరెక్టర్ సుధాకర్, పాల్గొన్నారు.


సిరిసిల్లలో..

పెల్లుబికిన నిరసన

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ అరెస్టుపై ఆ పార్టీ నేతలు జిల్లాలో నిరసనలతో హోరెత్తించారు. సిరిసిల్లలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. పోలీసులు అడ్డుకోబోగా ఇరువర్గాల మధ్య వాగ్వాదం, తోపులాటలు జరిగాయి. పేపర్ లీకును సాకుగా చూపి అక్రమంగా అరెస్టు చేశారని ఆరోపించారు. నిరసన ప్రదర్శనల్లో పాల్గొన్న బీజేపీ నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. - సాక్షి, నెట్‌వర్క్


ఎల్లారెడ్డిపేటలో దిష్టిబొమ్మ దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

ముంపు గ్రామాల సమస్యలు పరిష్కారిస్తాం

- ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబు

వేములవాడఅర్బన్: మిడ్ మానేరు ముంపు గ్రామాల్లోని ప్రజల సమస్యలు కొంతవరకు పరిష్కారించామని, మిగిలి ఉన్న సమస్యలను త్వరలోనే పరిష్కారిస్తామని ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబు అన్నారు. వేములవాడ మండలం చింతల్‌ఠాణా గ్రామంలోని నూతనంగా నిర్మించిన మహిళ సంఘం భవనం, వాటర్ ప్లాంట్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ముంపు గ్రామాల నిరుపేదలకు రాబోయే రోజుల్లో 300 డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. అలాగే దళితబంధు యూనిట్లు కూడా మంజూరు చేసుకుందామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, జిల్లా ఇన్‌చార్జి బసవరాజు సారయ్య, ఎంపీపీ బూర వజ్రమ్మ, సెస్ డైరెక్టర్ హరిచరణ్‌రావు, సర్పంచ్ రేగులపాటి రాణి, వైస్‌ఎంపీపీ రేగులపాటి రవిచందర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.


మహిళా సంఘం భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

రైతులకు అండగా నిలవాలి

వేములవాడ: నూతన మార్కెట్ కమిటీ పాలకవర్గం రైతులకు బాసటగా నిలుస్తూ వారికి మెరుగైన సేవలందించాలని ఎమ్మెల్యే రమేశ్‌బాబు కోరారు. బుధవారం ఆయన్ని కలిసేందుకు వేములవాడకు వచ్చిన మేడిపల్లి నూతన ఏఎంసీ పాలకవర్గసభ్యులతో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్‌చైర్మన్ హరిచరణ్‌రావు, ఎంపీపీ దోనకంటి ఉమాదేవి, ఏఎంసీ చైర్మన్ ఉదగిరి రమ్య, వైస్‌చైర్మన్ లింగారెడ్డి, డైరెక్టర్లు, పార్టీ మండల అధ్యక్షుడు సత్తిరెడ్డి, గుండ్లపల్లి సర్పంచ్ సంపత్ పాల్గొన్నారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం


కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

వీర్నపల్లి: మండలంలోని అడవిపదిర గ్రామంలో గ్రామస్తుల ఆధ్వర్యంలో శివ పార్వతుల కల్యాణాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శివ పార్వతుల ఉత్సవ విగ్రహాలను వీధుల్లో ఊరేగించారు. అనంతరం కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. మహిళలు కుంకుమపూజ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎడ్ల అక్మీరాజం, సెస్ డైరెక్టర్ మల్లేశం, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా శకటోత్సవం

ఇల్లంతకుంట: మండలంలోని పోత్తూరులో బుధవారం శ్రీలక్ష్మీవేంకటేశ్వర స్వామి శకటోత్సవం వైభవంగా జరిగింది. గ్రామస్తులు ఎడ్ల బండ్లు, వాహనాలను ఆలయం చుట్టూ డప్పు చప్పుళ్లతో తిప్పారు. జెడ్పీ వైస్‌చైర్మన్ సిద్ధం వేణు పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవం

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మండలం అల్మాస్‌పూర్ లోని శ్రీ హరిహర పుత్ర అయ్యప్పస్వామి ఆలయంలో బుధవారం వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం గణపతి, సుబ్రమణ్య, పరివారదేవతల పూజలు, అయ్యప్పస్వామికి పంచామృత, గంధ, భస్మ, కనక, పుష్పాభిషేకాలు వైభవంగా నిర్వహించారు. సాయంత్రం మహాపూజ నిర్వహించారు. స్వామివారి ఆభరణాలంకరణ, హరివారాసనం కార్యక్రమాలు జరిగినవి.

బాధిత కుటుంబానికి సాయం

సిరిసిల్లటౌన్: విధి నిర్వహణకు వెళ్తూ రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ప్రభుత్వ ఉపాధ్యాయురాలి కుటుంబాన్ని ఉపాధ్యాయ జేఏసీ బుధవారం పరామర్శించింది. ఇల్లంతకుంట మండలం రహీంఖాన్‌పేట ఆదర్శ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయురాలు బండ రజిత ఇటీవల చనిపోగా జిల్లా ఉపాధ్యాయ జేఏసీ నేతలు కుటుంబ సభ్యులకు రూ.15 వేలు ఆర్థికసాయంగా అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ జేఏసి కన్వీనర్ మోతీలాల్, కోకన్వీనర్ విక్రుతి లక్ష్మీనారాయణగౌడ్, బుర్ర కృష్ణప్రసాద్‌గౌడ్, కొండికొప్పుల రవి తదితరులు పాల్గొన్నారు.

వార్షికోత్సవం



గంభీరావుపేట: మండలం దమ్మన్నపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవంలో విద్యార్థుల సంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ, రాజేశ్వర్‌రెడ్డి, ఎంపీపీ వంగ కరుణ, జెడ్పీటీసీ కొమిరిశెట్టి విజయ, సర్పంచ్ సిరిగిరి లక్ష్మీ, తల్లిదండ్రులు పాల్గొన్నారు.





పేపర్ల లీకేజీపై కాంగ్రెస్ ఆందోళన

గంభీరావుపేట/తంగళ్లపల్లి/ఎల్లారెడ్డిపేట: పదో తరగతి పరీక్ష ప్రశ్న పత్రాల లీకేజీని నిరసిస్తూ జిల్లాలో కాంగ్రెస్ నాయకులు బుధవారం నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. గంభీరావుపేటలో బుధవారం ధర్నా, రాస్తారోకో చేసి ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. తంగళ్లపల్లి, ఎల్లారెడ్డిపేటలో ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం సందర్భంగా పోలీసులకు, కాంగ్రెస్ నాయకులకు తోపులాట జరిగింది.